నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 16 జూన్ 2024 RANGAREDDY

# వికారాబాద్ కలెక్టర్‌గా ప్రతీక్‌జైన్

- భద్రాచలం ఐటీడీఏ పీవోగా పనిచేస్తున్న ఆయనకు పోస్టింగ్
- నల్లగొండ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిన నారాయణరెడ్డి
- వికారాబాద్ కలెక్టర్‌గా పాలనలో తనదైన ముద్ర
- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ కూడా బదిలీ
- జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్‌గా నియామకం


కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డి బదిలీ అయ్యారు. ఆయన్ను నల్లగొండ కలెక్టర్‌గా ట్రాన్స్‌ఫర్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన స్థానంలో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రతీక్‌జైన్‌ను కలెక్టర్‌గా నియమించింది. గతంలో రంగారెడ్డి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా ప్రతీక్‌జైన్ పనిచేశారు. వికారాబాద్ కలెక్టర్‌గా ఏడాదిన్నరపాటు పనిచేసిన నారాయణరెడ్డి పాలనలో తనదైన ముద్ర వేశారు. అదేవిధంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న రాహుల్‌శర్మ కూడా బదిలీ అయ్యారు. ఆయన్ను జయశంకర్‌భూపాలపల్లి కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎన్నికలు ముగియడంతో బదిలీలు షురూ అయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్‌ల నుంచి తహసీల్దార్ల వరకు బదిలీలకు రంగం సిద్ధం చేసిన ప్రభుత్వం ముందుగా కలెక్టర్లను బదిలీ చేసింది. త్వరలోనే ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లకూ స్థానచలనం జరుగనున్నది.

## పాలనలో తనదైన ముద్ర..

వికారాబాద్ కలెక్టర్‌గా ఏడాదిన్నరపాటు పనిచేసిన నారాయణరెడ్డి పాలనలో తన ముద్ర వేశారు. 2023 జనవరి 31న ఆయన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి పాలన ను గాడిలో పెట్టారు. ఉద్యోగులకు అటెండెన్స్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.


కలెక్టర్ నారాయణరెడ్డి

అధికారులు, ఉద్యోగులతో సఖ్యతగా ఉంటూ జిల్లాను అన్నింటిలోనూ ముందుకు తీసుకెళ్లారు. అసెంబ్లీతోసహా లోక్‌సభ ఎన్నికలను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఎన్నికల సిబ్బందికి తానే స్వయంగా శిక్షణ నిచ్చి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నారు. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో.. జిల్లా లో కొత్త ఓటర్లు 50 వేల వరకు పెరిగారు. అంతేకాకుండా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి, తానూ హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా తాను కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టక ముందు భారీగా ఉన్న ధరణి దరఖాస్తులు... భూసమస్యలను పరిష్కరించి రైతులకు మేలు చేశారు. ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి సారించి రికార్డు స్థాయిలో కూలీలు పనులకు హాజరయ్యేలా కీలకంగా వ్యవహరించారు. వేసవిలో ప్రతి కూలీకీ పని కల్పించేందుకు ప్రతిరోజూ ఉదయం, సాయం త్రం సమయాల్లో వరుసగా 20 రోజులపాటు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా జిల్లాలో రోజుకు 1.50 లక్షల మంది కూలీలు పనికి వెళ్లేలా చొరవ చూపారు. అదే విధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి సంబంధించి స్థలం మార్పులో కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీని మొదట అనంతగిరిలోని టీబీ శానిటోరియం స్థలంలో నిర్మించాలని నిర్ణయించారు. దీంతో వందలాది చెట్లను నరికివేయాలని ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం నివేదించింది. తదనంతరం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డి మినీ ఊటీగా పేరొందిన అనంతగిరి అడవిలో ప్రకృతికి ఎలాంటి నష్టం కలగకుండా శ్రీఅనంత పద్మనాభ కాలేజీ సమీపంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి స్థలాన్ని మార్చుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, ఆమోదం తెలిపింది.

# హెచ్‌ఎండీఏలో నెలాఖరు వరకే డీపీఎంఎస్

## 1 నుంచి టీఎస్ బీపాస్‌తోనే భవన నిర్మాణ అనుమతులు

సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణ, లేఅవుట్ల అనుమతుల కోసం హెచ్‌ఎండీఏ పరిధిలో సింగిల్ విండో విధానాన్ని మాత్రమే అమలు చేయనున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల కోసం 2016 నుంచి డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీపీఎంఎస్)ను ప్రారంభించగా, దాని స్థానంలో కొత్తగా టీ ఎస్ బీపాస్ విధానాన్ని తీసుకొచ్చారు. ఇప్పటి వరకు రెండు విధానాల్లో అనుమతులకు అవకాశం ఉన్నది. జూలై 1 నుంచి కేవలం టీఎస్ బీపాస్ ద్వారానే ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ 7 జిల్లాలు, 70 మండలాలు, 1032 గ్రామాల్లో విస్తరించి ఉన్నది. ఇందులో జీహెచ్‌ఎంసీతో పాటు 7 కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలు, 697 గ్రామాలు ఉన్నాయి. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ, లే అవుట్ల అనుమతులు డీపీఎంఎస్ ద్వారా ఇస్తుండగా, ఇక నుంచి హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఇచ్చే అనుమతులన్నీ టీఎస్ బీపాస్ ద్వారా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికనుగుణంగానే వెబ్‌సైట్ మార్పులు చేస్తున్నారు.


# వామ్మో..కరెంట్ బిల్లు!

## విద్యుత్తు బిల్లుల మోత.. వినియోగదారులకు వాత..

**నెల కరెంట్ బిల్లు రూ.7,37,440.. సోషల్ మీడియాలో వైరల్**

- జూన్ నెలకు సంబంధించి భారీగా కరెంట్ బిల్లులు
- నెల రోజులకు కాకుండా 40-45 రోజులకు బిల్లులు తీసిన బిల్ కలెక్టర్లు
- మారిన స్లాబ్‌లు.. రెండింతలు, మూడింతలు పెరిగిన బిల్లులు
- లబోదిబోమంటున్న వినియోగదారులు








28 రోజులకు మే నెలలో వచ్చిన కరెంట్ బిల్లు



37 రోజులకు జూన్ నెలలో వచ్చిన కరెంట్ బిల్లు

జిల్లాలో కరెంట్ బిల్లులు మోత మోగిస్తున్నాయి. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగి కష్టంగా మారిన పేద, మధ్యతరగతి ప్రజల బతుకులు.. విద్యుత్తు బిల్ కలెక్టర్ల నిర్లక్ష్యంతో వచ్చిన అధిక విద్యుత్తు బిల్లులను చూసి వారు లబోదిబోమంటున్నారు. జూన్ నెలకు సంబంధించి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో భారీగా కరెంట్ బిల్లులొచ్చాయి. గతంలో వచ్చే విద్యుత్తు బిల్లులతో పోలిస్తే జూన్ నెలకు సంబంధించి రెండింతలు, మూడింతలు పెరుగడం గమనార్హం. బిల్ కలెక్టర్లు విద్యుత్తు బిల్లులను నెలరోజులకు కాకుండా 40-45 రోజుల మధ్య తీస్తుండడంతో స్లాబ్‌లు మారి భారీగా కరెంట్ బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లితోపాటు పలు కాలనీల్లో భారీగా వచ్చిన కరెంట్ బిల్లులను నుంచి వినియోగ దారులు షాక్‌కు గురవుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ వినియోగదారుడికి మే నెలకు సంబంధించి రూ.297 విద్యుత్తు బిల్లు రాగా, జూన్ నెలకు రూ. 546 వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్తు బిల్ కలెక్టర్ల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

- వికారాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ)

## నెల కరెంట్ బిల్లు.. రూ.7,37,440

రూ.7,37,440.. ఇది ఓ పరిశ్రమకో.. ఓ బహుళ జాతి సంస్థకు సంబంధించి 30 రోజుల కరెంట్ బిల్లు అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఈ బిల్లు ఐదు బల్బులున్నా పేద కుటుంబం నివాసముంటున్న ఓ ఇంటికి వచ్చింది. వికారాబాద్ మండలంలోని సిద్దులూరు గ్రామ పంచాయతీకి చెందిన ఇంటినంబర్ 2-7/1 ఎన్కెపల్లి గోపాల్‌కు జూన్ నెలకు సంబంధించి రూ.7,37,440 విద్యుత్తు బిల్లు వచ్చింది. ప్రతినెలా రూ.100 లోపు వచ్చే బిల్లు ఈ నెలలో ఒకేసారి రూ.లక్షల్లో రావడంతో గోపాల్ షాక్‌కు గురయ్యాడు. ఈ విషయం ఊరంతా తెలిసి సోషల్ మీడియాలో శుక్రవారం రాత్రి నుంచి వైరల్ అయ్యింది. అప్రమత్తమైన విద్యుత్తు శాఖ అధికారులు శనివారం మధ్యాహ్నం బిల్లును ఆ సైట్ నుంచి తొలగించారు.

# నడిపించిన నాన్నకే నాన్నయ్యాడు..

## నేడు ఫాదర్స్ డే


తండ్రి నర్సింహారెడ్డితో ధర్మారెడ్డి

ప్రస్తుత కాలంలో పిల్లల ముఖం చూడనిదే తండ్రులు ఒక్క అడుగు బయటకు వేయడంలేదు. చిన్నారులతో చిన్నారిలా మారి వారితో సమయం గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమ తండ్రులు, తాతలు మిస్ అయిన చిన్నారుల ప్రేమను పొందేందుకు ఇష్టపడుతున్నారు. నేటితరం పిల్లలకు నాన్నే నేస్తం. పొద్దంతా అమ్మే చూసుకుంటున్నా, గోరు ముద్దలు తినిపిస్తున్నా.. నాన్న రాగానే మాత్రం చటుక్కున చంకనెక్కేస్తున్నారు. గట్టిగా హగ్ చేసేసుకుంటున్నారు. నాన్న.. పొద్దున అమ్మ తిట్టింది, నేనడిగింది ఇవ్వట్లేదు అంటూ కంప్లయింట్‌లు చేసేస్తున్నారు. నాన్నకు పిల్లలు ఎంత దగ్గరవుతున్నారనేందుకు ఇవే నిదర్శనాలు.

-పెద్దఅంబర్‌పేట, జూన్ 15

- కదల్లేని నాన్నను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న కొడుకు
- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన తండ్రి
- 13 ఏండ్లుగా సేవలో నిమగ్నమైన తనయుడు ధర్మారెడ్డి
- కుటుంబ సహకారంతో అన్నీ తానై..

బిడ్డా.. కొన్ని నీళ్లివ్వురా.. అని నాలుగు సార్లు చెప్తే విసుక్కుంటాం..
అరేయ్.. కొంచెం మెడికల్ షాప్‌కు వెళ్లి మందులు తీసుకురారా అని కోరితే కసురుకుంటాం..
'హాస్పిటల్‌కు తీసుకెళ్లి చూపించురా.. బాగా నొప్పిగా ఉన్నది' అని నెలలో నాలుగుసార్లు చెప్తే సర్రుమని లేచిపోతాం.
నాన్న ఏమాత్రం శుభ్రంగా లేకపోయినా, ఆయన నుంచి దుర్వాసన వచ్చినా ఇదేం జీవితం అంటూ కుమిలిపోతాం..
బట్టల్లోనే మల, మూత్ర విసర్జన చేస్తే ఇక ఆ కోపానికి హద్దులుండవు.

కానీ, వీటన్నింటికీ భిన్నం ఈ అన్నం ధర్మారెడ్డి. చిన్నప్పుడు తన చేతులు పట్టుకొని నడిపించిన నాన్నకే నాన్నయ్యాడు. 13 ఏండ్లుగా కదల్లేని తన తండ్రిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. నాలుగు మాటలు కూడా మాట్లాడలేని, చేతిని సైతం కదిలించలేని స్థితిలో ఉన్న తండ్రికి అన్నీ తాను అయ్యాడు. ఏండ్లుగా సేవ చేస్తూ 'పితృదేవో భవ' అంటున్నాడు. 'ఆయనిచ్చిన జన్మే కదా ఇది. ఆయనకు సేవ చేయడం నా అదృష్టం' అంటున్నాడు. తల్లి, భార్య, పిల్లల సహకారంతో నాన్నకు సేవ చేయడం ఇష్టంగా మారిందంటున్నాడు.

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని వైఎస్సార్‌నగర్‌లో అన్నం నర్సింహారెడ్డి, లలిత దంపతులు రెండు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. వీరి ఏకైక కుమారుడు అన్నం ధర్మారెడ్డి. ఇతనికి వివాహమై, దాదాపు పదేండ్లకు పైగా వయసున్న ఇద్దరు పిల్లలున్నారు. ధర్మారెడ్డి ప్రైవేటు ఉద్యోగి. నర్సింహారెడ్డికి 2008 పక్షవాతం వచ్చింది. దీంతో మహారాష్ట్ర గుల్బర్గాలో ఏడాదిపాటు చూపించారు. మందుల ఖర్చులు పెరిగాయి. రవాణా కూడా భారమైంది. ఆ తర్వాత స్థానికంగా మందులు తినిపించారు. రెండేండ్ల తర్వాత ఆరోగ్యం కొంచెం నయమైంది. ఆ తర్వాత ఓ రోజు బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టింది. శరీరంలో ఎడమవైపు భాగం పడిపోయింది. మళ్లీ తల్లితో కలిసి ధర్మారెడ్డి నిత్యం హాస్పిటళ్ల బాట పట్టాడు. తండ్రిని బాగా చూసుకోవాలని తపించాడు. అప్పుడే నర్సింహారెడ్డి మోకాళ్ల చిప్పలు కూడా అరిగిపోయాయి. ఆపరేషన్ చేయించినా సక్సెస్ కాలేదు. 2012లో కిడ్నీల సమస్య వచ్చింది. ఆ తర్వాత నోట్లో నుంచి రక్తం వాంతులు అయ్యాయి. ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. 2015లో ఈఎస్ఐకి తీసుకెళ్లగా పిత్తాశయంలో ఇన్‌ఫెక్షన్‌తో పరిస్థితి విషమంగా ఉన్నదని, ఆపరేషన్ చేసినా కష్టమేనని వైద్యులు చెప్పినా.. ధర్మారెడ్డి ఎక్కడా తగ్గలేదు. 'మీ నాన్న అయితే ఇలానే చేస్తారా?' సార్ అంటూ వైద్యులను ఎదురు ప్రశ్నించాడు. ఆపరేషన్ చేయించాడు. 2016లో మళ్లీ సమస్య వచ్చింది.. నెల బతకడమే కష్టమని వైద్యులు తేల్చేశారు. మళ్లీ ఆపరేషన్ చేయించాడు.. 2019 కిడ్నీ సైజ్ మరింత తగ్గిపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దవాఖాన వాళ్లే వెళ్లిపోమన్నా.. కొడుకు మాత్రం నాన్నను బతికించుకుంటానని శపథం పన్నాడు. ఒకటి తర్వాత మరొకటి జబ్బులు వచ్చి 13 ఏండ్లుగా నర్సింహారెడ్డి మంచానికే పరిమితమయ్యాడు. అయినా నిత్యం కంటికి రెప్పలా కాపాడుతున్నాడు ఆ కొడుకు.

## నాన్న గ్రేట్..



నాన్న నిజంగా గ్రేట్. మేం చిన్నగా ఉన్నప్పుడు మమ్మల్ని ఎలా చూసుకున్నాడో.. ఇప్పటికీ వాళ్ల నాన్నను అలాగే చూసుకుంటున్నాడు. తాతను పలుకరించకుండా నాన్న ఇంట్లోంచి అడుగు కూడా బయట పెట్టడు. మాకు టైం కేటాయిస్తూనే తాతకు అన్ని పనులు చేస్తడు. నాన్న లేనప్పుడు నానమ్మ, అమ్మ, మేం ఇద్దరం సాయం చేస్తుంటాం. అప్పట్లో నానమ్మ కూడా పనికి వెళ్లేది. అప్పుడు అమ్మ, మేము తాతకు సాయం చేసేవాళ్లం. ఎంత బిజీగా ఉన్నా, ఎన్ని పనులున్నా సాయంత్రం రాగానే తాతయ్య దగ్గరికి వెళ్లిపోతాడు. సెలవు రోజు వస్తే ఎక్కువ టైం నాన్న తాతయ్యతోనే ఉంటాడు. ఆయనకు పాత పాటలు వినిపిస్తూ ఉత్సాహాన్ని నింపుతడు. నాన్నను చూశాకే తెలిసింది. మేం కూడా నాన్న బాటలోనే నడుస్తం. కనిపెంచినోళ్లకు సేవ చేయడం అదృష్టమని నాన్న చెప్తుంటాడు.

- అన్నం యోగేశ్వర్‌రెడ్డి (ఇంటర్ ఫస్టియర్),
ఈశ్వర్‌రెడ్డి (తొమ్మిదో తరగతి)

### అన్నీ తానై..

నర్సింహారెడ్డి తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. కనీసం కదలలేడు. ఏ విషయాన్ని మాట్లాడలేడు. దీంతో ధర్మారెడ్డి అన్నీ తానై తండ్రిని కంటిరెప్పలా కాపాడుకుంటున్నాడు. లేచిందే మొదలు నాన్నకు బ్రెష్ చేపించడం, స్నానం చేయించడం, శుభ్రమైన వస్త్రాలు తొడిగించడం అన్నీ ఒకటి తర్వాత మరొకటి చేసేస్తున్నాడు. కనీసం కూర్చోలేని తండ్రికి తోడుగా నిలిచాడు. కనీసం అన్నాన్ని కూడా నమలలేని నాన్నకు వైద్యుల సూచనలతో లిక్విడ్ రూపంలో ఆహారాన్ని అందిస్తున్నాడు. రాగి జావ, పాలు, బ్రెడ్డు, అన్నాన్ని మెత్తగా మిక్సీ చేసి తాగిస్తున్నాడు. మల, మూత్ర విసర్జనను నిత్యం శుభ్రం చేస్తున్నాడు. సమయానికి మందులు ఇస్తున్నాడు. ఎప్పుడు 48 గంటలపాటు మందులు ఆపేసినా మనిషి బతకడం కష్టమే అని వైద్యులు చెప్పడంతో మరింత జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. నాన్న చేసే సైగలతోనే విషయాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. కుటుంబంలో గొడవలు జరిగినా నాన్నే మొదటి ప్రాధాన్యం అని తేల్చి చెప్పాడు. ఆ తర్వాత భార్య, తల్లితో కలిసి నాన్నకు సేవ చేస్తున్నాడు.

### నాన్న విలువ పిల్లలకు తెలియాలని..

నర్సింహారెడ్డి అనారోగ్యంతో మంచాన పడితే.. ఆ మంచాన్నే హాల్‌లోకి మార్చాడు ధర్మారెడ్డి. 'నాన్న విలువ పిల్లలకు తెలియాలి కదా'.. అదేంటి ఓ రూంలో వేస్తే సరిపోతుందిగా అని బంధువులు ఇచ్చే ఉచిత సలహాకు ఆయనిచ్చిన సమాధానం ఇది.

13 ఏండ్లుగా నాన్నను విడిచి ఒక్క రాత్రి కూడా ఎవరింటికీ వెళ్లలేదని చెప్తున్నాడు ధర్మారెడ్డి. ఏ చుట్టాల ఇంటికి వెళ్లినా, దావత్‌లకు వెళ్లినా.. రాత్రికే ఇంటికి వచ్చేస్తాడు. ఆస్తులు సంపాదించి ఇవ్వలేదనో, భారంగా మారారనో తల్లిదండ్రులను అనాథలుగా మారుస్తున్న ఎందరో పిల్లలకు ధర్మారెడ్డి ఆదర్శం.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్

# ఆరోగ్య కార్యక్రమాల అమలులో.. ఐదోస్థానంలో జిల్లా

**వైద్యాధికారులను ప్రశంసించిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్**

వికారాబాద్, జూన్ 15 : వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో ఐదోస్థానంలో నిలిచిందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ ప్రశంసించారు. శనివారం జిల్లాలోని చెన్‌గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సం దర్శించగా.. డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మసీ స్టోర్, ల్యాబ్, ప్రసూతి, ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించి..వైద్యాధికారులు, సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పలు సూచనలు చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా ఐదో స్థానంలో ఉన్నందుకు ప్రశంసిస్తూ ఇంకా సమర్థవంతంగా పని చేసి మొదటిస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో ప్రో గ్రాం అధికారులు డాక్టర్లు రవీంద్రయాదవ్, జీవరాజ్, సాయిబాబా, రతన్‌లాల్, బుచ్చిబాబు, నిరోష పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్లను చక్కదిద్ది..

**క్షేత్రస్థాయిలో డిస్కం స్పెషల్ డ్రైవ్**

**వర్షాకాలంలో అంతరాయం లేని సరఫరాపై ప్రత్యేక దృష్టి**

సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): వర్షాకాలంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించడంపై డిస్కం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జీహెచ్‌ఎంసీతో పాటు హెచ్‌ఎండీఏ పరిధిలో విస్తరించి ఉన్న 9 సర్కిళ్లలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్నది. ముఖ్యంగా గృహ విద్యుత్‌తో పాటు వ్యాపార వాణిజ్య సంస్థలు, ఐటీ కంపెనీలు, పారిశ్రామిక వాడలన్నీ వీటి పరిధిలోనే ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత వర్షా కాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు క్షేత్ర స్థాయిలో విద్యుత్ లైన్లను పర్యవేక్షిస్తూ నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి ఆయా కాలనీలు, వ్యాపార వాణిజ్య కేంద్రాలు, పరిశ్రమలకు వెళ్లే విద్యుత్ లైన్లలో ఉన్న లోపాలను గుర్తిస్తున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని 11 కేవీ ఫణిగిరి కాలనీ ఫీడర్‌లో దెబ్బతిన్న జంపర్‌లను మార్చారు. అదేవిధంగా బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని 11 కేవీ ఆంధ్రా బ్యాంక్ ఫీడర్‌లో ఏబీ స్విచ్‌ను పునరుద్ధరించి, విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చేశారు. సికింద్రాబాద్ సర్కిల్‌లోని 11 కేవీ రైల్వే రిజర్వేషన్ ఫీడర్‌లో హెచ్‌జీ ఫ్యూజ్‌ను మార్చివేశారు. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలోని 33/11కేవీ లుంబినీ పార్కు సబ్ స్టేషన్ వద్ద దెబ్బతిన్న జంపర్‌లను మార్చి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మరమ్మతులు చేపట్టారు. ప్రతి విద్యుత్ లైను తనిఖీ చేస్తూ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ఉండేలా పరికరాలను మారుస్తున్నామని సర్కిల్ అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు తరచూ నిర్వహించడం ద్వారా మెరుగైనా సరఫరా అందించేలా డిస్కం చర్యలు చేపట్టిందని వివరించారు.